క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఆదికేశవ

మద్దికెర : స్థానిక శ్రీవిద్యాసాయి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆదివకేశవ ఎస్‌జీఎఫ్ హైజంప్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, ప్రిన్సిపాల్ సునీత మంగళవారం తెలిపారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపిక కావడంతో విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సేంద్రియ ఎరువులతో పెట్టుబడులు ఆదా


పత్తి రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ నరేంద్రకుమార్

ఆస్పరి: సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల సాగులో పెట్టుబడులు ఆదా అవుతుందని.. అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ నరేంద్రకుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని బనవనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి రైతులకు గులాబి పురుగు నివారణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటలకు రసాయనక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదోని రూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసేలా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం విధులను బహిష్కరించి, మద్యం దుకాణాలను మూసివేసి నిరసన తెలియజేశారు. మద్యం దుకాణ సిబ్బంది వీరేష్, చంద్రశేఖర్, వినోద్, రాము తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తాము గతంలో పనిచేస్తున్న ఉద్యోగాలను వదిలివేసి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు చేరామన్నారు. నేడు తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకుండా మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేలా జీఓ జారీ చేయడం అన్యాయమన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు తాము విధుల్లోకి చేరబోమని తెగేసి చెప్పారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సైదులుకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ కావడంతో మందుబాబులకు మద్యం లభించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గుడేకల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ నాయకులు నిరసన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కర్నూలులోని గాంధీ విగ్రహం వద్ద డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, మారుతి, షకూర్‌సాహెబ్, రాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు బుధవారం నుంచి దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కే. శామ్యూల్ గారి ఆదేశాలు ప్రకారం ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించారన్నారు. ఒక రోజు ముందు అంటే నేడు మహాత్మగాంధీ జయంతి సందర్భంగా పాఠశాలలకు సెలవు దినము కనుక ఒకరోజు ముందుగానే విద్యార్థులకు సెలవు కలిసి వచ్చిందని తెలిపారు. తిరిగి పాఠశాలలు ఈ నెల 14వ తేదీన పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

పెద్దకడబూరు : ప్రభుత్వం నుంచి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.13.5 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేసినట్లు నార్మ్ సంస్థ, ఎస్సీ సబ్‌ప్లాన్ చైర్మన్ డాక్టర్ ఎం.బాలకృష్ణన్ తెలిపారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ 2023 - 24 పథకం కింద జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ(నార్మ్) సంస్థవారు ఎస్సీ రైతుమిత్ర గ్రూపునకు ఏఓ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో రెండు కల్టీవేటర్లు, రెండు పవర్ వీడర్లు, రెండు డిస్క్ నాగళ్లు, రెండు చెక్క నాగళ్లు, రెండు లెవెలింగ్ బ్లేడ్లు, రెండు విత్తన గొర్రులు, రెండు రోటోవేటర్లు, రెండు మల్చర్లు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నార్మ్‌సంస్థ హైదరాబాద్ కార్యాలయంగా ఉంటూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నార్మ్‌సంస్థ అధికారులు డాక్టర్ యం.రమేష్‌నాయక్ , టెక్నికల్ ఆఫీసర్లు డాక్టర్ విజయేంద్రరెడి పాల్గొన్నారు.

జియారత్‌తో ముగిసిన ఎల్లార్తి ఉరుసు


ప్రత్యేక అలంకరణలో షేక్షావలి తాత సమాధి


గంధంతో వెళ్తున్న పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రి


పాటలు పడుతున్న ఫకీరులు

హొళగుంద: ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి తాతల ఉరుసు మంగళవారం జియారత్ కార్యక్రమంతో ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు దర్గాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా దూద్‌పీరా, జెండాకట్ట తదితర దర్గాలను దర్శించుకున్నారు. ఉత్సవంలో భాగంగా సెప్టెంబర్ 29న గంధం, 30న ఉరుసుతో పాటు మంగళవారం జియారత్ కార్యక్రమాలు జరిగాయి. పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రి గంధం మోసుకుని ఆయా దర్గాల్లో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అలాగే భక్తులకు ధర్మ సందేశాన్ని ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సమయంలో దర్గాలో ఉంటున్న ఫకీరులు ఆటపాటలతో నృత్యాలు చేసి భక్తులను అలరించారు. ఏపీ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన 362వ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ బాలనరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీరాములు

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవి శవన్నరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీరాములు మంగళవారం తెలిపారు. అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కో రూపంలో అలంకరించి పూజ కార్యక్రమాలు చేపడుతామన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు అశ్వీయుజ శుద్ధ పాడ్యమిన రుద్రాభిషేకంతో నవరాత్రులు ప్రారంభిస్తామన్నారు. దాతల సహకారంతో ప్రతి రోజు మధ్యాహ్నం, రాత్రి భోజనం సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 13న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనంలో రాజకీయం తగదు


ఎంఈఓ చిరంజీవిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై రాజకీయాలు చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ పార్టీ నాయకులకు ఏజెన్సీ బాధ్యతలు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సాఫీగా సాగుతున్న భోజన సరఫరాలో రాజకీయాలు చేసి గ్రామాల్లో గొడవలు సృష్టించొద్దని కోరారు. సీఐటీయూ నాయకులు షాకీర్, కృష్ణ, షేకున్‌బీ తదితరులు ఉన్నారు.

ముందస్తు దసరా వేడుకలు


పద్మ విద్యా వికాస్ పాఠశాలలో నవరాత్రుల అమ్మవారి రూపాల్లో విద్యార్థులు


తొమ్మిది రూపాలతో చిన్నారులు

మద్దికెర : పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవులు ఉండటంతో ముందస్తుగా సంబరాలు జరుపుకున్నారు. స్థానిక శ్రీవిద్యాసాయి కళాశాలలో విద్యార్థులు నవదుర్గల రూపాల్లో అలంకరణ చేసుకొని మహిషాసుర వధ కథనాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): పద్మ విద్యా వికాస్ పాఠశాలలో విద్యార్థినీలు దేవి నవరాత్రుల్లో అమ్మవార్ల రూపాల్లో దర్శనమిచ్చారు. అలాగే శారదా విద్యానికేతన్‌లో నవరాత్రుల్లో చివరి రోజైన దసరా పండుగ రోజున దర్శనమిచ్చే మహిషాసుర మర్దిని దేవి రూపంలో దర్శనమిచ్చారు. సనాతన ధర్మాల ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలియజేయాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బడేసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో పప్పుశనగలు పంపిణీ చేయాలని వినతి


ఆలూరు: వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు


ఆస్పరి: మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఆలూరు: రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులకు 50 శాతం రాయితీతో పప్పు శనగలు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈరన్న, పరమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీఏ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలూరు నియోజకవర్గంలో రబీ సీజన్‌లో 30-35 వేల ఎకరాల్లో పప్పుశనలు, జొన్న, వాము, ధనియాలు తదితర పంటు సాగుచేస్తారని తెలిపారు. చాలా మంది రైతులకు సాగు పెట్టుబడికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాలేదన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాయితీతో విత్తనాలు మంజూరు చేయాలని కోరారు.

ఆస్పరి: రైతులకు 50 శాతం సబ్సిడీతో పప్పు శనగల విత్తనాలు అందజేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు కోరారు. మంగళవారం ఆస్పరిలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల నుంచి వర్షాలు సరిగ్గా లేకపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలయ్యారని అవేదన వ్యక్తం చేశారు. ఆస్పరి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినా ఇప్పటి వరకు నష్టపరిహారం అందజేయలేదన్నారు. ఈ ఏడాది పప్పు శనగలు క్వింటాల్ రూ.9,400గా ప్రభుత్వం నిర్ణయించిందని.. అందులో 25 శాతం సబ్సిడీతో రూ.7,050లకు అందజేస్తామని చెప్పడం సరికాదని.. 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి, రంగప్ప, మల్లికార్జునరెడ్డి, చిన్న ఈరన్న, రవి పాల్గొన్నారు.

పాఠశాల రోడ్డుకు మోక్షం


ఇంగళదహాళ్ జెడ్పీ హైస్కూల్ రోడ్డు(నాడు)


గ్రావెల్ వేసిన తర్వాత ఇలా

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, టీచర్లు తిరిగేందుకు ఇబ్బందిగా ఉన్న రస్తాను మంగళవారం గ్రామ సర్పంచ్ ప్రమిదావతమ్మ బాగు చేయించారు. పాఠశాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు దగ్గరగా ఉన్నా పిచ్చి మొక్కలు పెరిగి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉండేది. సమస్యను గ్రామ పెద్దలు, టీచర్లు, విద్యార్థులు సర్పంచ్ ప్రమిదావతమ్మ, ఆమె భర్త వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పంచాయతీ నిధులతో మంగళవారం పిచ్చి మొక్కలు తొలగించి గ్రావెల్ వేసి దారిని బాగు చెయించారు. దీంతో టీచర్లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మారెల్లలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని మారెల్ల వీరాంజనేయస్వామి ఆలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ధార్మిక కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం పాటించాలని సూచించారు. తొలిరోజు ప్రవచకులు డాక్టర్ తొగట సురేష్‌బాబు శ్రీమద్రామాయణంలోని ఆదర్శ జీవన విలువల గురించి వివరించారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరవ సలహాదారుడు సుధాకరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరాముడు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌లో 10, సెకండియర్‌లో 9 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఎంఈఓ-2 రమేష్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటి భర్తీకి సంబంధించి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసి ఎక్కడా ఇంటర్‌లో చేరని బాలికలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు గుర్తించాలన్నారు. గుర్తించిన బాలికల తల్లిదండ్రులకు నచ్చజెప్పి జాయిన్ చేయించేలాని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ

మద్దికెర : ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్టెప్ (స్టూడెంట్ టీచర్స్ ఎడ్యుకేషన్ పేరెంట్స్) వారి ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు చేత ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆపద్బాంధు సేవా సమితి అధ్యక్షుడు, స్టెప్ జిల్లా సమన్వయకర్త చౌక్కా సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. శిక్షణా తరగతులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కెళ్ల గ్రామంలో ఉన్న ధ్యాన ఆశ్రమంలో నిర్వహిస్తారని హాజరయ్యే ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణతో పాటు భోజన వసతి, మెటీరియల్స్, సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు 9030644440, 8143234555 నంబర్లకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పప్పుశనగ విత్తనాల కేటాయింపు

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 3,890 క్వింటాళ్లు 25 శాతం సబ్సిడితో పప్పుశనగ విత్తనాలు (జేజీ-11 రకం) మంజూరు చేసిందని ఏఓ రవి మంగళవారం తెలిపారు. పప్పుశనగ పూర్తి ధర రూ.9,400 కాగా సబ్సిడీ 25 శాతం రూ.2,350 పోను రూ.7,050 రైతు చెల్లించాల్సి వుంటుందన్నారు. ఎకరా రైతులకు 40 కిలోలు, 5 ఎకరాలు ఆపైన ఉన్న రైతులకు 200 కిలోలు ఇవ్వబడునన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

దేవనకొండ: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా నిత్యం కరువుతో అల్లాడిపోతుందన్నారు. పంటలు సరిగ్గా పండక రైతులు, వ్యవసాయ కూలీలు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. పాలకులు మారినా జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు మాత్రం పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేదావతి ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. నాయకులు ధర్మ, రాము, నాగరాజు, మాబాషా, రంగస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రకు అందజేశారు. ఉచిత ఇసుక ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.


సిబ్బంది పింఛన్ల పంపిణీకి వెళ్లడంతో చిప్పగిరి సచివాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సచివాలయాలు ఖాళీ

చిప్పగిరి: ప్రతి నెలా ఒకటవ తారీఖు వచ్చిందంటే మండలంలోని 9 గ్రామ సచివాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనమివ్వాల్సిందే. మంగళవారం మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలోని 16 గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో సచివాలయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా సచివాలయాలకు వచ్చిన ప్రజలు చేసేదేమి లేక వెను తిరిగారు. ఇదిలా ఉండగా మరో వైపు చాలా గ్రామాల్లో పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా కాలనీల్లో ఏదో ఒక స్థలంలో కూర్చొని పంపిణీ చేశారు. అధికారులు ఇళ్ల వద్దకు రాక పోవడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దు


పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పంటలకు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడకుండా అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని జిల్లా ఎరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సూజాతమ్మ రైతులకు సూచించారు. మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో సోమవారం కంది, పత్తి, పొగాకు పంటలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ గిరీష్, ఉద్యాన అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి, ఏఓ అక్బర్‌బాషాతో కలిసి పరిశీలించారు. పత్తి పంటలో ఆశించిన పచ్చదోమ నివారణకు ఆసిటామిప్రిడ్ లేదా ఫ్లోనికామిడ్ లేదా అసిఫేట్ పురుగు మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షణ బుట్టలు అమర్చాలన్నారు. గడ్డి పూలను గుర్తించినట్‌లెతై గులాబీ రంగు పురుగు ఉధృతి తెలుసుకుని మొదటి దశ నివారణకు ప్రొఫెనోపాస్ మందును వేపనూనెతో పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా పొగాకు పంటలో రసం పీల్చే పురుగు నివారణకు ఎకరానికి 400 ఎం.ఎల్ డైమిథోయేట్ వేపనూనెను లీటర్ నీటికి 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ 200 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 70 ఎంఎల్ లేదా ఇండోక్సాకార్బ్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పుల్లగుమ్మి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాంబశివుడు, నవ్యజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామ సమీపంలో కర్ణాటక మద్యం బాటిళ్లను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం తుంగభద్ర నది తీర గ్రామాల్లో పర్యటిస్తుండగా మండలంలోని కడదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్, కౌతాళం మండలం తిప్పల దొడ్డి గ్రామానికి చెందిన కాకం గారి జగదీష్ 10 బాక్స్‌లలో 960 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై ఇద్దరుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్‌ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, మల్లికార్జున ఉన్నారు.

చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత వస్త్రాలకు రాయితీ కల్పించాలని కోరారు. ప్రస్తుతం చేనేత కార్మికులకు పనులు లేక ఇతర వృత్తులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 11రకాల వస్త్రాలు చేనేతల ద్వారా తయారు చేయించాలని జీఓ ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం కింద ఏటా నేత కార్మికులకు రూ.24వేలు ఇచ్చేదని, అయితే ఈపథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చేతి వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి గోవిందు, చేనేత నాయకులు ఎం.కృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్


పచ్చారపల్లిలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

హాలహర్వి: గ్రామీణ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంకును నిర్మించారు.. అయితే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయలేక ఏళ్లు గడుస్తున్నా వినియోగంలేక రాక ఓ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఆ వాటర్ ట్యాంకు కూలిపోతుందోనని విద్యార్థులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాల ఆవరణలో తరగతి గదికి ఏడు అడుగుల దూరంలో ఒకే స్తంభంతో ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు నీటి కోసం ఉపయోగించలేదు. 15 ఏళ్లు గడిచినా ఈ ట్యాంకును వినియోగంలోకి అధికారులు తీసుకురాలేదు. ఎంపీపీ స్కూల్‌కు దగ్గరగా ఉండడంతో వాటర్ ట్యాంకు మున్ముందు వర్షాలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చుట్టూ ఇళ్లు ఉండడం, ఇటీవల కురిసిన వర్షానికి వాటర్ ట్యాంకు పై నుంచి రెండుసార్లు పిల్లలు ఆడుకునే సమయంలో పెచ్చులు ఊడి పడ్డాయి. పిల్లలు రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న ఈ వాటర్ ట్యాంకును వీలైనంత త్వరగా నిర్వీర్యం చేయాలని గ్రామస్తులు, పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు, విద్యా కమిటీ చైర్మన్ వన్నూరుస్వామి తదితరులు కోరుతున్నారు.